క్లుప్తంగా

నేడు మండల పరిషత్ అత్యవసర సమావేశం

నడిగూడెం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అత్యవసర మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.డి.ఇమామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశాల మేరకు ఈ నెల 7 నుంచి 14 వరకు అన్ని గ్రామాలలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

స్నేహితుల చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని సీతారాంనగర్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పాలపాటి శేఖర్ కుటుంబానికి మిత్రులు సోమవారం చేయూతనందించారు. పేదరికంలో ఉన్న శేఖర్ కుటంబసభ్యులకు స్నేహితులంతా కలిసి రూ.75 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు కిష్టపాటి సైదిరెడ్డి, గంజి వెంకటేశ్వర్లు, సందీప్, జి.సైదులు, సత్యనారాయణ, అల్లావుద్దీన్, నరసింహ, వెంకన్న, పాపారావు, శివ, కిషోర్, వినాయకరావు, రాము, ఓం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నడిగూడెం : మండల కేంద్రంలో సోమవారం రజక సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర నాయకుడు కొరట్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, కొరట్ల ప్రసాద్, మేరె రంగయ్య, రెడ్డిపల్లి లింగయ్య, గుండు నాగేశ్వరరావు, ఏనుగుల వీరాంజనేయులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

నేరేడుచర్ల : ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 6వ తేదీన పట్టభద్రుల ఓటు నమోదు గడువు ముగుస్తున్నందని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కట్ట రామారావు, కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, నాయకులు శంకరాచారి, సురేష్‌రెడ్డి, సీతారాంరెడ్డి, సత్యనారాయణ, సైదులు, మనోజ్, నాగరాజు, కృష్ణారావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్ఐ సైదిరెడ్డి అన్నారు. సోమవారం చింతలపాలెం మండలంలోని దొండపాడులో రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాలు వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని చెప్పారు. అతివేగం ప్రమాదకరమని తెలిపారు. వాహనాల యజమానులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఇతర ధ్రువపత్రాలు కలిగి ఉండాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రెండు టిప్పర్లు, ట్రాక్టర్ల పట్టివేత

సూర్యాపేట రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు, రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కంచికర్ల కీసర వాగు నుంచి అనుమతి లేకుండా రెండు టిప్పర్లలో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తుండగా మండలంలోని పిల్లలమర్రి స్టేజీ వద్ద పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా మండలంలోని భీమారం, టేకుమట్ల వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

దేవుడికే శఠగోపం!


బూరుగడ్డ వేణుగోపాలస్వామి ఆలయం, ఇన్‌సెట్‌లో స్వామివారి మూలవిరాట్

స్వామివారి మూలవిరాట్

- సమస్యగా మారిన బూరుగడ్డ ఆలయ భూముల కౌలు వసూలు
- ఈఏడాది పెండింగ్ రూ.18.60 లక్షలు
- గతేడాది బకాయి రూ.5 లక్షలు
- కష్టంగా ఆలయ నిర్వహణ

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రజలకు ఆపదొస్తే దేవుడి వద్ద మొరపెట్టుకుంటారు. అలాంటిది కొందరు దేవుడికే శఠగోపం పెడుతున్నారు. వందలాది ఎకరాల దేవుడి మాన్యం భూమిని కౌలుకు తీసుకొని కౌలు చెల్లించడం లేదు. దీంతో ఆలయంలో పండుగలు, బ్రహ్మోత్సవాలు, ఇతర ప్రత్యేక కార్యక్రమాలతో పాటు దూపదీప నైవేద్యాలకు కూడా తీవ్ర ఇబ్బంది తలెత్తుతోంది. ఇది ఆధ్యాత్మికతకు నెలవైన బూరుగడ్డలోని శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయ దుస్థితి.

581 ఎకరాల దేవుడి మాన్యం..

హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ శాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి విగ్రహాలను ఒకే పీఠంపై కాకతీయుల రాజు సత్రం బొల్లం రాజు నిర్మించారు. ఆధ్యాత్మికంగా ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయానికి హుజూర్‌నగర్, గోపాలపురం మధ్య సర్వే నంబర్ 118 నుంచి 622 వరకు, 122 సర్వే నంబర్‌లలో 581 ఎకరాల దేవుడి మాన్యం ఉంది. మధ్యమధ్యలో కొన్ని పట్టా భూములు కూడా ఉన్నాయి. కాగా దేవుడి మాన్యంలోని 465 ఎకరాలకు సంబంధించిన 350 మంది రైతులు నుంచి ఎకరాకు రూ.4 వేలు చొప్పున ఈ ఏడాది రూ. 18.60 లక్షలు కౌలు రావాల్సి ఉంది. నామమాత్రమైన ఈ కౌలులో నేటికీ ఒక్క రైతు కౌలు చెల్లించలేదు. గత ఏడాది కూడా ఈ ఆలయానికి కౌలు రూపేణా రైతులు రూ. 5 లక్షల బకాయి ఉన్నారు. దీంతో ఆలయ నిర్వాహణ కష్టంగా మారింది.

80 శాతం గోపాలపురం రైతులే..

దేవుడి మాన్యాన్ని 30 ఏళ్లుగా హుజూర్‌నగర్, గోపాలపురం, రాయినిగూడెం గ్రామాలకు చెందిన రైతులు కౌలుకి చేస్తున్నారు. వీరిలో గోపాలపురం గ్రామానికి చెందిన రైతులే 80 శాతం ఉన్నారు. దేవాలయం బూరుగడ్డలో ఉన్నా ఈ గ్రామానికి చెందిన ఒక్క రైతు కూడా ఆలయ భూములను కౌలుకి తీసుకునే అవకాశం దక్కలేదు. భూమి ఒకచోట, దేవాలయం మరోచోట ఉన్నందున గోపాలపురం, హుజూర్‌నగర్ రైతులు ప్రతి ఏటా కౌలు చెల్లించడం లేదని బూరుగడ్డ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ భూముల కౌలును బహిరంగ వేలం వేయాలని అధికారులు పదేళ్ల క్రితం నిర్ణయించారు. కాగా దీనికి రాజకీయ గ్రహణం పట్టింది. కౌలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని బూరుగడ్డ గ్రామ రైతుల ఆశలు నేటికీ నెరవేరలేదు. కౌలు వసూలు చేయడానికి దేవాలయ శాఖ అధికారులు తరుచూ గోపాలపురంలోని రచ్చబండ వద్దకు వెళ్లి ఖాళీ చేతులతో తిరిగి వెళ్లడం షరా మాములుగా మారింది.

కౌలు వసూలు భారంగా మారింది



ప్రతి ఏటా ఆలయ భూములు కౌలు వసూలు చేయాలంటే తలకు మించిన భారంగా మారింది. అధికారులు గోపాలపురం గ్రామం వెళుతున్నా ఏ ఒక్క రైతు కౌలు చెల్లించడం లేదు. 2022- 23 డిసెంబర్ వరకు (ఈఏడాది) 350 మంది రైతులు రూ.18.60 లక్షలు కౌలు చెల్లించాల్సి ఉంది. నేటికీ ఒక్క రూపాయి కూడా వసూలు కాలేదు. రైతులు కౌలు చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలి.

– ఎంపి లక్ష్మణరావు, ఈఓ, బూరుగడ్డ ఆలయం


వేణుగోపాలస్వామి ఆలయ భూములు

గ్రామ అభివృద్ధికి పాలకవర్గం కృషి


మాధవరం మాజీ సర్పంచ్ పంచాయతీ, పాలకవర్గంతో వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

- వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి

మునగాల : గడిచిన ఐదేళ్ల కాలంలో మాధవరం గ్రామాభివృద్ధికి సర్పంచ్ నంద్యాల విజయలక్ష్మితో పాటు పాలకవర్గ సభ్యులు కృషిచేశారని వికారాబాద్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. మునగాల మండలంలోని మాధవరంలో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం అదే గ్రామానికి చెందిన ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించి మాట్లాడారు. మాధవరం గ్రామం మండలంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, ఉపసర్పంచ్ ఆరె.జానకమ్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామపెద్దలు ఎలక నరేందర్‌రెడ్డి, ఆరె.రామకృష్ణారెడ్డి, నంద్యాల శ్యామ్‌సుందర్‌రెడ్డి, వార్డు సభ్యులు ఎలక కవిత, సంజీవరెడ్డి, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డు అనుసంధానం చేయించాలి

- డీఈ వెంకటకిష్టయ్య


మాట్లాడుతున్న విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య

హుజూర్‌నగర్ : విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం కోసం విద్యుత్ సర్వీస్ నెంబర్‌కు రేషన్ కార్డు అనుసంధానం చేయించుకోవాలని హుజూర్‌నగర్ డివిజన్ విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గృహ జ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందేందుకు విద్యుత్ వినియోగదారులు మీటర్ రీడర్లు (విద్యుత్ బిల్లు కొట్టేవారికి) రేషన్ కార్డు, ఆధార్ కార్డులను చూపించి విద్యుత్ సర్వీస్ నంబర్‌కు అనుసంధానం చేయించుకోవాలని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు మీటర్ రీడర్లకు సహకరించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందాలని ఆయన కోరారు.

గీతకార్మికులకు లైసెన్సులు ఇప్పిస్తాం


గీత కార్మికులకు టాపింగ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు, కెఎల్ఎన్ ప్రసాద్

కోదాడరూరల్ : అర్హులైన గీతకార్మికులందరికీ లైసెన్సులు మంజూరు చేయించేందుకు తనవంతు కృషి చేస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ కెఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. సోమవారం కోదాడ మండల పరిధిలోని అడ్లూరులో గీత కార్మికులకు టాపింగ్ టెస్ట్ (తాటి చెట్టు పైకెక్కె పరీక్ష) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గీతకార్మిక వృత్తిలో ఉన్నవారందరూ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, లైసెన్సులు ఉన్నవారు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. అదే విధంగా గీత కార్మికుల ఎక్స్‌గేషియాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచబోతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది వీఎస్‌రావు, గౌడ సంఘం నాయకులు యరగాని వెంకటేష్‌గౌడ్, ఉసిరికాయల వెంకటేశ్వర్లు, పెదపోలు కొండలు, యరగాని నాగేషు తదితరులు ఉన్నారు.

అమరవీరుల ఆశయసాధనకు కృషి చేయాలి


విజయరాఘవరంలో అమరవీరుల సంస్మరణ సభలో మాట్లాడుతున్న లింగయ్య

మునగాల : అమరవీరుల ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య పిలుపునిచ్చారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు నిర్వహించిన అమరవీరులు సుంకర లక్ష్మీనర్సయ్య, బోళ్ల రామిరెడ్డిల సంస్మరణ సభను సోమవారం మునగాల మండలంలోని విజయరాఘవపురంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్ర (మార్క్సిస్టు–లెనినిస్టు) పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సయ్య స్మారక స్థూపం వద్ద ఆయన జెండా ఆవిష్కరించారు. అనంతరం ఓపీడీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి సుంకర రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో లింగయ్య మాట్లాడారు. భారతదేశంలో విప్లవ ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పోలేబోయిన ముత్తయ్య, యూసీసీఆర్ఐ (ఎంఎల్) పార్టీ నాయకులు నల్లగొండ వెంకన్న, ఓపీడీఆర్ జిల్లా కార్యదర్శి కొనకంచి వీరభద్రయ్య, తండా మల్సూర్, ముప్పాని లింగారెడ్డి పాల్గొన్నారు.

రైతు బాంధవుడు మంత్రి ఉత్తమ్


అనంతగిరి : ఉత్తమ్ పద్మావతి దంపతుల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


నడిగూడెం : మేజరు కాల్వ వద్ద ఉత్తమ్ దంపతుల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతగిరి : నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతు బాంధవుడు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని శాంతినగర్ శివారులో గల పాలేరు వాగుపై ఉన్న ఉత్తమ్ పద్మావతి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.ఐదు కోట్ల ముప్పై లక్షల నిధులు కేటాయించి విడుదల చేయడంపై హర్షిస్తూ సోమవారం శాంతినగర్‌లో ఉత్తమ్ పద్మావతి దంపతుల చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొగలాయికోట, లకారం, బొజ్జగూడెంతండా, శాంతినగర్, గోండ్రియాల, తమ్మర బండపాలెం, కొత్తగూడెం గ్రామాలలోని ఐదువేల ఎకరాలకు నీరు అందించేందుకు ఉత్తమ్ కుమార్‌రెడ్డి శాంతినగర్ శివారులోని పాలేరు వాగుపై 2006లో సుమారు రూ.7 కోట్లతో ఉత్తమ్‌పద్మావతి ఎత్తిపోతల పథకంను ఏర్పాటు చేశారని, గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకాన్ని పట్టించుకోకపోవడంతో చుక్కనీరు సాగుకు అందక రైతులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు ఉత్తమ్ కుమార్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన యాభై రోజుల వ్యవధిలోనే లిఫ్ట్ మరమ్మతులకు నిధులు కేటాయించి విడుదల చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో గునుకుల గోపాల్‌రెడ్డి, కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణిపుల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బాణోతు బాబునాయక్, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, కొండపల్లి వాసు, ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, పాకనాటి రాఘవరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, వీ.వీరబాబు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ్ దంపతుల చిత్రపటానికి పాలాభిషేకం

నడిగూడెం : సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రత్నవరం సమీపంలోని కొత్తగూడెం మేజర్ కాల్వ వద్ద రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సోమగాని రవి, మాజీ సర్పంచ్ పసులేటి వినయ్‌వర్ధన్‌బాబు, ఉప సర్పంచ్ మొలుగూరి ఉపేందర్, నాయకులు ఉమా రఘువీర్, సోమ సీతమ్మ, రామిని భూపాల్‌రెడ్డి, ఆదిమళ్ల ఉపేందర్ పాల్గొన్నారు.

మరో ఐదు రోజులు నీటిని విడుదల చేయాలి


మంత్రి ఉత్తమ్‌తో రైతులు

గరిడేపల్లి : సాగర్ కాలువ ద్వారా మరో ఐదు రోజుల పాటు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపాలని మండలంలోని గానుగబండ, కొండాయిగూడెం గ్రామాల రైతులు కోరారు. ఈమేరకు సోమవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి కోరారు. తాగు నీటి అవసరాల నిమిత్తం వేములూరి ప్రాజెక్టు, జాన్‌పహాడ్ మేజర్లకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో మంత్రి స్పందించి వేములూరి ప్రాజెక్టుకు నీటి విడుదలకు ఆదేశించినట్లు వారు తెలిపారు.

విద్యార్థికి అభినందన

సూర్యాపేటటౌన్ : దశరథ మెమోరియల్ ఫౌండేషన్ వారు ఆదివారం నిర్వహించిన ప్రతిభ పరీక్షలో సూర్యాపేట పట్టణంలోని న్యూ మిలీనియం పాఠశాలకు చెందిన బి.భానుచందర్‌నాయక్ ప్రథమ స్థానం పొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ బాల్తు లక్ష్మీశ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి


మునగాల : కొక్కిరేణిలో భారత్ బంద్ కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు


హుజూర్‌నగర్ : సీడీపీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను

మునగాల : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించబోయే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం మునగాల మండలంలోని కొక్కిరేణిలో బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతూ, బడా కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రవేట్‌పరం చేయడానికి కేంద్రం చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. దేశ వ్యాప్త బంద్‌లో కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, రైతు సంఘం కార్యదర్శి రావులపెంట వెంకన్న, మండల కమిటీ సభ్యులు రేఖ లింగయ్య, నిడిగొండ శంభయ్య, ఇంటూరి హుస్సేన్, రావులపెంట బ్రహ్మం, హమాలీ సంఘం మేస్త్రీలు, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలి

మఠంపల్లి : కేంద్రం కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని వ్యవసాయ కార్మిక జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. గురువారం మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 16న చేపట్టబోయే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. గ్రామీణ కార్మికులైన ఉపాధి హామీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, తదితర గ్రామ స్థాయి కార్మికులు కనీస వేతనం కోసం సమ్మెలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం ఉన్నారు.

16న సార్వత్రిక సమ్మె

మేళ్లచెరువు : ఈ నెల 16 జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు పిలుపునిచ్చారు. సోమవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమ్మెలో భాగంగా వివిధ కార్మిక సంఘాల కార్మికుల సంతకాల సేకరణ, సమ్మె నోటీస్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు కాసీం సైదా, దస్తగిరి, మథార్, లక్ష్మి, సైదమ్మ, జానీ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓకు సమ్మె నోటీస్ అందజేత

హుజూర్‌నగర్ : గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా ఈ నెల 16న నిర్వహించబోయే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.హుస్సేన్ కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో సీడీపీఓ విజయలక్ష్మీకి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు రన్మియా, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


సూర్యాపేటలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మద్దిరాల : మాజీ మంత్రి, పీసీసీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి వెంకటయ్య, మల్లారెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

మార్చి 20న పునః ప్రతిష్ఠ మహోత్సవం


దేవాలయ పునః ప్రతిష్ఠ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త రంగా తదితరులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో మార్చి 20న దేవతామూర్తుల పునః ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త నాగుబండి రంగా తెలిపారు. సోమవారం కోదాడలోని ఎస్ఆర్ కంఫర్ట్‌లో ప్రతిష్ఠ మహోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఆయన ప్రతిష్ఠ మహోత్సవాల నిర్వాహకులు బ్రహ్మశ్రీ బుర్ర వాసుదేవాచార్యులు, ఆర్యవైశ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీర్ణోద్ధరకు చేరుకున్న శ్రీకోదండరామస్వామి దేవాలయ పున : ప్రతిష్ఠకు 2019లో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలయ పునర్నిర్మాణం పూర్తికావడంతో మార్చిలో వివిధ దేవతామూర్తుల మూలవర్యుల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతిష్ఠ మహోత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు గడిడేపల్లి లక్ష్మణ్‌రావు, పైడిమర్రి నారాయణరావు, పందిరి సత్యనారాయణ, ఇరుకుళ్ల చెన్నకేశవరావు, వెంపటి మధు, కొత్తూరు శ్రీనివాసరావు, చల్లా నర్సింహారావు, దేవరశెట్టి బ్రహ్మం, శివాలయం ప్రధాన పూజారి సుబ్రహ్మణ్యశర్మ, కొండ్లే రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాకోబ్‌కు నివాళి


యాకోబ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : సామాజిక స్పృహ ఉన్న వ్యక్తి ప్రభుత్వ పెన్షనర్ రేవూరి యాకోబ్ అని పెన్షనర్ల సంఘం నాయకులు అన్నారు. ఇటీవల మృతి చెందిన యాకోబ్ సంతాప సభ సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యాకోబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు చెన్న సోమయ్య, నాయకులు మోహినుద్దీన్, కేవీఎన్ మూర్తి, అంకతి అప్పయ్య, జూలకంటి నర్సిరెడ్డి, తాటి ప్రభాకర్ రెడ్డి, ఎంఎస్ఎన్ రాజు, రఘునాథ్, లక్ష్మయ్య, చంద్రయ్య, ఎల్.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, కోటయ్య, వేముల వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వరరావు, లలిత, పశ్య నారాయణరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ

నేరేడుచర్ల : పట్టణంలోని నిరుపేద మహిళలకు రాచర్ల సతీష్– కావ్య వివాహ మహోత్సవం సందర్భంగా నేరేడుచర్ల పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం బియ్యం, నిత్యావసర సరుకులను ఆ సంఘం పట్టణ అధ్యక్షురాలు కందిబండ వాసంతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచకొండ విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు బోనగిరి అంజయ్య, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు రాంమోహన్‌రావు, రాచకొండ శ్రీనివాస్‌రావు, అరుణ కుమారి, రాధిక, లక్ష్మణ్, హరిప్రసాద్, సంధ్య, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.


పేదలకు బియ్యం, సరుకులు అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

సేవా గుణాన్ని పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం


గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు

గరిడేపల్లి : సేవా గుణాన్ని పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిశుభ్రత పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా చేసి వారిలో దేశభక్తిని, సేవా గుణాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో ఎన్ఎస్ఎస్ ఏర్పాటైందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారులు వీరబాబు, సత్యనారాయణ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మరింత పటిష్టం చేద్దాం


అడ్లూరులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి

కోదాడరూరల్ : కోదాడ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ మండలంలోని అడ్లూరులో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈపూరి సత్యనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా వెంకట్రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులును ఎన్నుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని వరప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ తిరపయ్య తదితరులు ఉన్నారు.